క్లుప్తంగా

మాదిగలను మోసగించిన బీజేపీ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పొదలకూరు : కేంద్రంలోని బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేపడుతామని మోసగించిందని ఎమ్మార్పీఎస్ నేత మంగళపూరి సురేష్‌మాదిగ అన్నారు. మాదిగల మహా సంగ్రామ యాత్రలో భాగంగా మండలంలోని డేగపూడి ఎస్సీకాలనీలో శుక్రవారం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బీజేపీ నేతలను మాదిగ పల్లెలకు రానీయకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు చిడదల శ్రీనివాస్‌మాదిగ, పల్లిపాటి వెంకటేష్‌మాదిగ, జస్వంత్‌మాదిగ, జయమ్మ మాదిగ, రమణమ్మమాదిగ, సంపూర్ణమ్మమాదిగ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



వంశీధర్‌రెడ్డి



పూండ్ల స్టాలిన్

కోవూరు : మండల కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో కోవూరు అసోసియేషన్ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. కోవూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెన్నారెడ్డి వంశీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూండ్ల స్టాలిన్ ఎన్నికయ్యారు. అనంతరం స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

విద్యార్థులకు అభినందన



కొడవలూరు : మండలంలోని రెడ్డిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తలపల లాస్య, బెల్లంకొండ సంజన రాణి జాతీయ ఉపకార వేతనాలు(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన తురా రామ్‌చరణ్ రూపొందించిన ప్రాజెక్ట్ ఇన్‌స్పైర్–22లో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో పై ముగ్గురు విద్యార్థులను ఆ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేవీ శేషయ్య మాట్లాడుతూ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల వంతున నగదు అందుతుందని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ప్రాజెక్ట్ ఎంపిక కావడానికి కృషి చేసిన ఫిజిక్స్ టీచర్ మాణిక్యాల రవీంద్రబాబును హెచ్‌ఎంతో పాటు విద్యాకమిటీ చైర్‌పర్సన్ లావణ్య పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఉపాధ్యాయులు ఖాజావలీ, సీహెచ్.మాలకొండయ్య, వి.రమాదేవి పాల్గొన్నారు.

ఖురాన్ ప్రతుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలోని ఖాజానగర్‌లో ఉన్న ఏ ఆల్ అమీన్ మసీదు వద్ద హజరత్ షేక్.బాషా సాహెబ్ నూరి ఆధ్వర్యంలో ముస్లింలకు ఖురాన్ ప్రతులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లింలు హజరత్ అబ్దుల్ అజీజ్ ఖలీద్, ముజీర్ అహ్మద్, నూరి, మౌలాల అహ్మద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పుచ్చ పంట



రైతుతో కలిసి పంటను పరిశీలిస్తున్న వీహెచ్‌ఏ

పొదలకూరు : ఇటీవల కురిసిన అకాల వర్షంతో పుచ్చసాగు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ గుర్తించింది. మండలంలోని మొగళ్లూరు, కనుపర్తి, వనంతోపు తదితర గ్రామాల్లో పుచ్చ పంటను సాగు చేశారు. ఇక్కడి రైతులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ఉద్యానాధికారులను ఎన్యుమరేషన్ చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి దెబ్బతిన్న పుచ్చపంటను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యానాధికారి ఆనంద్ మాట్లాడుతూ మండలంలో 15 హెక్టార్లలో పుచ్చ పంట దెబ్బతిన్నట్లు తెలిపారు.

ఐదుగురు గైర్హాజరు

వెంకటాచలం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 103 మంది విద్యార్థులకు, 98 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ వెంకటదాసు



కట్టుబడిపాళెంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వెంకటదాసు

బుచ్చిరెడ్డిపాళెం : నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ శాఖ జిల్లా పీడీ వెంకటదాసు అధికారులను ఆదేశించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని కట్టుబడిపాళెంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ విషయంలో నీళ్లకు ఇబ్బందిగా ఉంటోందని, దీని వల్ల నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని పీడీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందించి అల్లూరు కాలువ నుంచి నీటిని సరఫరా చేసి ఇళ్ల నిర్మాణాలకు నీటికొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల విషయంలో లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. ముఖ్యంగా గడువులోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే విధంగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఉచితంగా ఇంటిని నిర్మించి ఇస్తోందని, దీనికి అవసరమైన స్థలాన్ని కూడా ఉచితంగానే అందిస్తోందని వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ జగదీశ్వరి, ఏఈ గౌస్‌మొహిద్దీన్, సిబ్బంది మల్లికార్జున్ ఉన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనులు



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట్రావ్

- డ్వామా పీడీ వెంకట్రావ్

మనుబోలు : లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తున్నామని డ్వామా పీడీ వెంకట్రావ్ సూచించారు. మండలంలోని యాచవరంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఉపాధి పనులు ఎలా కల్పిస్తున్నారని, కూలి సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కోటి 15 లక్షల పనిదినాలు కల్పించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కోటి 78 వేల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. వారంలోగా లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు చేపడుతామన్నారు. రోజుకు 70 వేల మందికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ రాజమ్మ, టీఏ సుప్రజ, ఎఫ్‌ఏ హరేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



కొడవలూరులో జరిగిన అవగాహన ర్యాలీ



పొదలకూరు : విఘ్నేశ్వరపురం కాలనీలో..

కొడవలూరు : జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే సులువుగా నివారించవచ్చన్నారు. రెండు వారాల పాటు దగ్గు, జలుబు, ఆయాసం ఉంటే తప్పక పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధి కావడంతో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. పీహెచ్‌సీల్లో క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంటున్నందున సందేహం ఉంటే వెంటనే సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం సుభాషిణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- పొదలకూరు : పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీలో మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆదేశాల మేరకు వైద్యారోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా రెండు వారాల పాటు దగ్గు, ఛాతి నొప్పి, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాక్సిన్, పౌష్టికాహారం, పొగ తాగకుండా ఉండడం చేస్తే వ్యాధిని నివారించ వచ్చన్నారు. ఈ ర్యాలీలో ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, పర్యవేక్షకులు అనూరాధ, రమణమ్మ, సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, కామాక్షమ్మ, మునిరాధిక తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

- అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సులు



పొదలకూరు : సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ అన్నపూర్ణ



వెంకటాచలం : మంగళంపాడులో అవగాహన కార్యక్రమం

పొదలకూరు : పోషకాహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని పొదలకూరు సీడీపీఓ ఎం.అన్నపూర్ణ పేర్కొన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, తల్లులు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషణ్ పక్వాడా ముఖ్య ఉద్దేశం మంచి ఆహారపు అలవాట్లతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడమేనన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ఆయా గ్రామాల్లో పౌష్టికాహారంపై పిల్లలు, తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించి మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకునేందుకు కృషి చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రోజ్ మేరీ, ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్ అనూరాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ తెలియజేయాలి

వెంకటాచలం : పోషకాహార పదార్థాల ఆవశ్యకతపై ప్రతిఒక్కరికీ తెలియజేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.రమణమ్మ సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ మంగళంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ తల్లులు, పిల్లలకు పోషకారం లోపిస్తే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. పిల్లలకు వయసుకు తగ్గ బరువు ఉన్నారా లేదా తరచూ చూసుకోవాలని తెలిపారు. పోషకాహార పదార్థాలు తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా పెరుగుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మందల పద్మ, కొప్పోలు పద్మ, జి.ఉష, సీహెచ్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెరగాలి

కొడవలూరు : పోషక విలువలున్న ఆహారంపై గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెరగాలని, అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సీడీపీఓ జ్యోతి సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకుకూరలు, పాలు, గుడ్లలో సమృద్ధిగా పోషకాలున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వైఎస్సార్ కిట్‌లు, బాలామృతంలో మెండుగా పోషకాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అరుణ, సూపర్‌వైజర్ వి.పద్మావతి, మహిళా పోలీసు హెబ్సిబా తదితరులు పాల్గొన్నారు.

బొడ్డువారిపాళెంలో..

స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలపై గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. సెక్టార్ సూపర్‌వైజర్ తలపల నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, ఎస్తేరమ్మ, మధుసూదనమ్మ, హరిప్రియ, అనూరాధ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం

తోటపల్లిగూడూరు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నట్లు ఇందుకూరుపేట ఐసీడీఎస్ సీడీపీఓ హేనాసుజన్ పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు జానావారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా ప్రోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం బియ్యాన్నే కాకుండా గ్రామీణులు చిరుధాన్యాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు మస్తానమ్మ, కవిత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కొడవలూరు : యల్లాయపాళెంలో పోషక విలువల గురించి వివరిస్తున్న సీడీపీఓ జ్యోతి



బొడ్డువారిపాళెంలో..



తోటపల్లిగూడూరు : నరుకూరు జానావారిపాళెంలో..

జాతీయ స్థాయి పోటీలో విద్యార్థి ప్రతిభ



విజేతలకు ప్రశంసా పత్రం అందజేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ రామలింగయ్య

ముత్తుకూరు : ముంబైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి 22 వరకు మూడు రోజుల పాటు జరిగిన 'నాలుగో స్టూడెంట్స్ కన్వెన్షన్ అండర్ సీ ఫెస్టోన్–23' వేడుకలో ముత్తుకూరు మత్స్యకళాశాల విద్యార్థి ప్రతిభ చాటారు. రెండో రోజు 'క్లైమేట్ చేంజ్' అనే అంశంపై జరిగిన కన్వెన్షన్‌లో ముత్తుకూరు మత్స్యకళాశాల పీహెచ్‌డీ విద్యార్థి కె.భీమేశ్వరరావుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా ప్రశంసాపత్రంతో పాటు రూ.5,000ల నగదు బహుమతి అందజేశారు. మొత్తం మత్స్య కళాశాల నుంచి 8 మంది విద్యార్థులతో పాటు ఫిషరీస్ డీన్ డాక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.మమత పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యార్థులను అసోసియేట్ డీన్ డాక్టర్ రామలింగయ్య శుక్రవారం అభినందించారు.

చదువుల తల్లికి పూజలు



ఇందుకూరుపేట : సరస్వతీపూజలో టీచర్లు



ముత్తుకూరు : హాల్ టికెట్లు అందజేస్తున్న టీచర్లు



మనుబోలు : బద్దెవోలు జెడ్పీ పాఠశాలలో..



కోవూరు జిల్లా పరిషత్ పాఠశాలలో..

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీపూజ నిర్వహించారు. రాబోయే పది పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని పూజలు జరిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాల్‌టికెట్ల పంపిణీ

ముత్తుకూరు : మండలంలోని ముసునూరువారిపాళెం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సరస్వతీ పూజ నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులతో హాజరైన విద్యార్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్ష ప్యాడ్లతో పాటు తదితర విద్యాసామగ్రిని సరస్వతీదేవి చిత్రపటం వద్ద ఉంచి మొక్కుకున్నారు. ఎంఈఓ మధుసూదన, ఎంపీపాళెం సర్పంచ్ మునుకూరు జనార్ధనరెడ్డి తదితరులు పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదవాలి

మనుబోలు : విద్యార్థులు పోటీతత్వంతో చదవాలని హెచ్‌ఎం మురళీమోహన్ సూచించారు. మండలంలోని బద్దెవోలు జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు.

- కోవూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సరస్వతీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గతేడాది జాతీయ స్కాలర్‌షిప్‌కు ఒక విద్యార్థి ఎంపికైందని, ఈ విద్యా సంవత్సరంలో హర్షిత, పెంచల దీక్ష, మేఘన, సిరాజున్నీసా, అమృత అనే ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. పది పరీక్షల్లో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

బుచ్చిరెడ్డిపాళెం : ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం చేసిన ఘటన అనంతసాగరం మండలం బొమ్మారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బుచ్చిరెడ్డిపాళెం సీఐ రామారావు కథనం మేరకు.. అనంతసాగరం మండలం బొమ్మారం గ్రామానికి చెందిన తానంపూడి మాల్యాద్రి (37) అనే వ్యక్తి ఈనెల 14న పనుల నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెనికి వచ్చి మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయి ఉండొచ్చని భావించిన కుటుంబసభ్యులు 15న వారి గ్రామంలో ఖననం చేశారు. అయితే రెండు రోజుల తరువాత మృతుని భార్య మహారాణి తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నట్లు బుచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అనంతసాగరం మండల తహసీల్దార్ వెంకటరమణరావు ఆధ్వర్యంలో మాల్యాద్రి మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం చేశారు. ఎస్సై వీరప్రతాప్ ఉన్నారు.

నేడు గురువిందపూడిలో మంత్రి కాకాణి పర్యటన

మనుబోలు : మండలంలోని గురువిందపూడి గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరిగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలియజేశారు.

నేడు రామతీర్థంలో 'గడప గడపకు..'

కోవూరు (విడవలూరు) : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరు మండలం రామతీర్థంలో శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలియజేశారు.

మంగళసూత్రం బహూకరణ



మంగళసూత్రాన్ని అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు శుక్రవారం జత మంగళసూత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన గిలకా శేషకుమారి అమ్మవారికి బంగారు మంగళసూత్రాన్ని అందజేశారన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. ఈఓ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

పల్లిపాడు డైట్‌లో ఉత్తరాఖండ్ అధ్యాపకులు



ప్రిన్సిపల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపక బృందం

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ డైట్ కళాశాలను ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని పౌరి గర్వాల్ ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థకు చెందిన అధ్యాపక బృందం శుక్రవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ వారికి డైట్ కళాశాలలో నిర్వహించే డీఎల్ఈడీ గురించి, సంస్థ నిర్వహించే కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఐటీ విభాగం, గ్రంథాలయం, సైన్స్ ప్రయోగశాల, వ్యాయామ విద్యా విభాగం, ఆడిటోరియం, డిజిటల్ క్లాస్‌రూంలు తదితర వాటిని పరిశీలించింది. అనంతరం పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని వారు సందర్శించారు. గాంధీ ఫొటో ఎగ్జిబిషన్ను తిలకించారు. తొలుత గాంధీ ఆశ్రమంలోని గాంధీ విగ్రహానికి, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బాలాజీరావు, విజయచంద్ర, పీడీ దశరథరామరెడ్డి పాల్గొన్నారు.

వివాహితకు అసభ్యకర మెసేజ్‌లు

నెల్లూరు(క్రైమ్): వివాహితకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడంతో పాటు ఆమెపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..వనంతోపుసెంటర్‌లో నివాసం ఉంటున్న ఓ వివాహిత ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తి అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టసాగాడు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేయగా ట్రూకాలర్‌లో చూడగా మిధున్‌రెడ్డి అనే పేరు వచ్చింది. దీంతో ఈ నెల 20న దంపతులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న నిన్ను, నీ భర్తను చంపేస్తానని వివాహితకు మిధున్‌రెడ్డి మేసేజ్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి ఎవరో తెలుసుకునేందుకు వివాహిత తెలియకుండా ఎలా అంటూ మిధున్‌రెడ్డి నంబర్‌కు మెసేజ్‌చేసింది. దీంతో ఆయన అదేరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి పెద్దగా కేకలు వేయడంతో పక్కగదిలో ఉన్న భర్త, చుట్టపక్కలవారు వాచ్చి సదరు వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వివాహితను వరండా మీద నుంచి కిందకు తోయబోగా, అక్కడున్నవారు అతనిని మందలించి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై దంపతులు ఇప్పటికే వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.